క్లుప్తంగా

నేడు మాచర్లలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి ప్రచారం

మాచర్ల : మాచర్ల పట్టణంలో బుధవారం 5,6,7 వార్డుల్లో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ పిఆర్కే ఆధ్వర్యంలో జరిగే ప్రచార కార్యక్రమానికి కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, ఆయా వార్డు ప్రజలు, కార్మికులు పాల్గొని ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పివిఆర్ కోరారు.

నేడు సీతారాముల కల్యాణ మహోత్సవం

పిడుగురాళ్ల : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో బుధవారం సీతా రాముల వారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనంతరం హాజరైన భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

21న మోడల్ పాఠశాల ప్రవేశాలకు అర్హత పరీక్ష



గురజాల : పల్లెగుంత గ్రామంలోని ఆదర్శ పాఠశాల (మోడల్) నందు ఆరవ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ఈనెల 21వ తేదిన అర్హత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ వి ఉషశ్రీ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అర్హత పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ముందుగా ఇంటర్నెట్ సెంటర్ నందు హాల్ టిక్కెట్లు పొందాలన్నారు. ఆదివారం 9 గంటల లోపు విద్యార్థులు పాఠశాల వద్దకు రావాలన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గురజాల : విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం మండల పరిధిలోని దైద గ్రామానికి చెందిన కేతావత్ శ్రీను నాయక్ తన ఇంటి సమీపంలో ఉన్న పంచాయతి పంపుకు విద్యుత్ మోటారు బిగించి నీటిని వాడుకునేవారు. రోజువారి లాగే మోటారు వేయడంతో నీరు రాక పోవడంతో వెళ్లి మోటారును ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో కేతావత్ శ్రీను నాయక్ అక్కడికక్కడే స్పృహ తప్పి కిందపడిపోగా క్షతగాత్రుడిని గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. మృతుడి భార్య లక్ష్మీ భాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు ఆడ, ఒక మగ సంతానం ఉన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

విజయపురి సౌత్ : మాచర్ల మండలంలోని నాగులవరం, సుబ్బారెడ్డి పాలెం, బోధనంపాడు, బెల్లంకొండవారి పాలెం గ్రామాల్లో సోమవారం రాత్రి విజయపురి సౌత్ ఎస్ఐ వెంకటకొండారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఎస్ఐ అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

రెండు షాపులను దహనం చేసిన దుండగులు

మాచవరం : గుర్తు తెలియని వ్యక్తులు రెండు షాపులను దగ్ధం చేసిన ఘటన మండలంలోని మోర్జంపాడు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుర్రా వెంకటరమణకు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ సమీపంలో చిల్లర దుకాణం ఉంది. ప్రక్కనే మేకల గోవిందయ్యకు చెందిన టైర్ల పంచర్ షాపు ఉంది. సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు షాపులకు నిప్పు అంటించడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. చుట్టు ప్రక్కల వారు చూసి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ఘటనలో మేకల గోవిందయ్యకు సుమారు రూ.3 లక్షలు, కుర్రా వెంకటరమణకు సుమారు. రూ.50 వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. బాధితులు స్థానిక మాచవరం పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

రైతులు భూసారం పెంచాలి

దాచేపల్లి : పంటలకు సాగుకు ముందే ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్ విత్తనాలు సాగు చేయటం వల్ల భూసారం పెరుగుతుందని ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి అన్నారు. మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ఈ విత్తనాల సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ రుతుపవనాలు రాకముందే భూమిలో పప్పుదినుసులు, చిరు ధాన్యాలు, నూనె గింజలు, ఆకు కూరలు, తీగజాతి, సుగంధ ద్రవ్యాలు, పచ్చిరొట్టే విత్తనాలు సాగు చేయాలని, ఈ విత్తనాలు సాగు చేయటం వలన భూసారం పెరిగి పంట సాగులో కలుపు కూడా నివారించవచ్చన్నారు. వీటి సాగు వల్ల భూమిలో నీటి నిల్వలు చేసుకునే సామర్థ్యం కూడా పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో డి. పాపకుమారి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిద్దాం..

ఓటింగ్ శాతాన్ని పెంచుదాం

నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్ఓ శ్యాంప్రసాద్



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్

మాచర్ల రూరల్ : నియోజక వర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పోలీసు అధికారులంతా సమిష్టిగా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్ కోరారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో పోలీసు అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల్లో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపించి వర్గాలు, గ్రూపులు, ఫ్యాక్షన్ వంటి వాటి పై నిఘా ఉంచాలన్నారు. అభ్యర్థులు ర్యాలీలు నిర్వహించే సమయం, ఇంటింటి ప్రచార కార్యక్రమాలలో అనుమతులను నిశితంగా పరిశీలించి ఇరు వర్గాలు ఎదురుపడకుండా ఒక్క చోట చేరకుండా చూడాలన్నారు. శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు అదుపులో ఉంచాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని ఆదేశించారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టులో తనిఖీలు చేసే సమయంలో ఖచ్చితంగా వీడియోలు తీయాలని, ప్రజలకు సి-విజిల్ యాప్ డౌన్‌లోడ్ పై అవగాహన కల్పించాలని కోరారు. గుర్తించిన సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అన్నీ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజలందరికీ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అంకితభావంతో పనిచేద్దామన్నారు. ఈ సమావేశంలో గురజాల డీఎస్పీ ఎ పల్లపురాజు, తహశీల్దార్ మంజునాథరెడ్డి, సిఐలు పి శరత్‌బాబు, కె సురేష్‌బాబు, బి చిన్న మల్లయ్య, ఎస్ఐలు అరుణ, రాజశేఖర్, శ్రీహరి, కొండారెడ్డి, రామాంజనేయులు, కోటయ్య, నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మిచెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాల పై సమీక్ష

పల్నాడు ప్రసిద్ది చెందిన శ్రీలక్ష్మిచెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాల నిర్వహణలో అన్నీ శాఖాధికారులు సమిష్టిగా పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్ కోరారు. ముఖ్యంగా 23న కళ్యాణం, 28న రథోత్సవం నాడు తీసుకోవాల్సిన చర్యల పై ఈఓ సాంబయ్యతో మాట్లాడారు. ఉత్సవాలలో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యుత్, ఆర్టీసి, మెడికల్, పోలీసులు తీసుకోవాల్సిన చర్యల పై ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలు శాఖాధికారులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మైనార్టీ కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల : రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అనేక సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 20 మంది మైనార్టీ కుటుంబాలు టీడీపిని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన అంబేద్కర్ సెంటర్‌లోని పూలమార్కెట్‌కు చెందిన మైనార్టీ నేతలను ఆయన సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపితో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పొత్తు పెట్టుకొని సీఎం జగన్ పై కుట్రలు చేస్తున్నారని, నిన్నటి వరకు బిజెపిని తిట్టి ఈ రోజు మైనార్టీలతో పనిలేదంటూ చంద్రబాబు కూటమి వ్యవహరిస్తున్నారన్నారు. దీనిని గమనించి మైనార్టీలంతా కూటమిని ఓడించి సీఎం జగన్‌కు అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ మస్తాన్, కో ఆప్షన్ మెంబర్ అంగార్ బాషా, మైనార్టీ నేతలు చిన్న బద్రు, చికెన్ బాజీ, పఠాన్ గౌస్, పలువురు ముస్లిం నాయకులున్నారు.

ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం

పాల్గొన్న పీఆర్కే తల్లి రాములమ్మ, చెల్లెలు నాగమణి



గాదెవారిపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్కే తల్లి రాములమ్మ

కారెంపూడి : మండలంలోని ఇనుపరాజుపల్లె, గాదెవారిపల్లె గ్రామాలలో వైఎస్సార్‌సీపీ మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే)ని గెలిపించాలని కోరుతూ పీఆర్కే తల్లి పిన్నెల్లి రాములమ్మ, , చెల్లెలు జవ్వాజి నాగమణి ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇనుపరాజుపల్లె గ్రామంలో ప్రచారం పూర్తి చేసుకున్న అనంతరం గాదెవారిపల్లెలో వారు ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి ఇప్పటి వరకు ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగిందని, మరింత మేలు చేసేందుకు రామకృష్ణారెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తల్లి రాములమ్మ, చెల్లి నాగమణి గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి కుటుంబ సభ్యులను పేరుపేరునా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇనుపరాజుపల్లెలో చర్చిలో వినాయకుని గుడిలో పూజల అనంతరం ఎస్సీ కాలనీ నుంచి ప్రచారం ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి గడపలో పీఆర్కే తల్లి రాములమ్మ, చెల్లి నాగమణికి విశేష ఆదరణ లభించింది. ఇనుపరాజుపల్లె సర్పంచ్ తగరం బుజ్జెమ్మాయి శేఖర్, ఉప సర్పంచ్ సువార్తమ్మ, ఆమనగంటి చినవెంకటేశ్వరరెడ్డి, కొరకూటి అంజి, గాలం అంకారావు, యరసాని బుచ్చిరెడ్డి, మోర్తల కోటిరెడ్డి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం గాదెవారిపల్లె గ్రామానికి చేరుకున్న వారికి గ్రామ పార్టీ నాయకులు సఖిల వెంకటరెడ్డి, ఎంపీటీసీ కూనిరెడ్డి సైదారెడ్డి, బైరెడ్డి చినశ్రీనివాసరెడ్డి, బైరెడ్డి కోటిరెడ్డి, బైరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (కొండలు), కొత్తా కాశిరెడ్డి, పోరెడ్డి బుచ్చిరెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గురజాల రామారావు తదితరులు స్వాగతం పలికారు. రామాలయంలో ప్రత్యేక పూజల అనంతరం రాములమ్మ, నాగమణి గాదెవారిపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఎంపీపీ బొమ్మిన సావిత్రి, జెడ్పీటీసీ షేక్ షఫీ, వైఎస్సార్‌సీపీ మండల ఎలక్షన్ ఇన్‌ఛార్జి దోర్నాల సాంబిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, మేకల శ్రీనివాసరెడ్డి, పాతూరి రామిరెడ్డి, బొంకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి మహిళ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పిన్నెల్లి సతీమణి రమాదేవి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రమాదేవి

మాచర్ల : సీఎం జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు ఎంతో మేలు చేశారని, అలాంటి ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకుని ప్రతి మహిళ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి పిన్నెల్లి రమాదేవి అన్నారు. మంగళవారం మాచర్ల పట్టణంలోని 12, 13 వార్డులకు చెందిన కౌన్సిలర్ కొమెర పిచ్చయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్ణయ్య షెడ్ నుంచి సెయింటాన్స్ చిన్న కాన్వెంట్ మీదుగా పలు వీధుల్లో రమాదేవి మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించి ఇంటింటికీ జగన్ చేసిన మంచి పనులకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సంక్షేమం పొందిన ప్రతి కుటుంబం సీఎం జగన్‌కు అండగా నిలబడి రాష్ట్రంలో సీఎం జగన్‌ను, నరసారావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ పిఆర్కేను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మహిళా కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఆదిరాల నాగమణి, చల్లా రమణ, లక్ష్మి, పలువురు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

రిటర్నింగ్ అధికారి రమణాకాంత్ రెడ్డి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారి రమణాకాంత్ రెడ్డి

గురజాల : ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రెవెన్యూ డివిజన్ అధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి జీవి రమణాకాంత్ రెడ్డి సూచించారు. నియోజకవర్గ కేంద్రం గురజాలలో మంగళవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. ప్రలోభాలకు గురికాకుండా మంచి చేసే నాయకుడిని ఎన్నుకోగలిగే శక్తి ఒక్క ఓటుకు మాత్రమే ఉంటుందన్నారు. వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా ఓటర్లను చైతన్యపరచేందుకు ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40 శాతం పైబడిన అంగవైకల్యం కలిగిన దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేయడానికి అర్హులన్నారు. ఇందుకోసం ఫారం 12డి పూర్తి చేసి సంబంధిత ధృవీకరణ పత్రాలను జతచేసి ఎన్నికల అధికారికి సమర్పించాలన్నారు. ఎవరికి ఓటు వేయాలో ఇష్టం లేని వారు నోటాకు ఓటు వేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు ఒక మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు వజ్రాయుధం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అశోక్ కుమార్ రెడ్డి, నగర పంచాయతీ కమీషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్, వాగ్దేవి బి ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశానికి హాల్‌టికెట్లు విడుదల

ఏపి మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసులు



జెట్టిపాలెం (రెంటచింతల) : జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల (ఏపీ మోడల్ స్కూల్)లో 6వ తరగతి ప్రవేశానికి 2024-2025 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్‌టికెట్లు విడుదలైనట్లు ఏపి మోడల్ స్కూల్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్ 6లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మాత్రమే హాల్‌టికెట్లు విడుదలైనట్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ ఐడీ, వారి పుట్టిన తేదీని ఎంటర్ చేసి వారి హాల్‌టికెట్లు పొందవచ్చన్నారు. విద్యార్థులకు ఈ నెల 21న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక పాఠశాలలోనే పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో పరీక్ష రాయడానికి విద్యాశాఖ అనుమతించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సెల్ నంబర్ 9182958496 సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ ప్రచారానికి అపూర్వ స్పందన



రెంటచింతల : మండలంలోని గోలి, పశర్లపాడు, మిట్టగుడిపాడు గ్రామాల్లో మాచర్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పి. అనీల్‌కుమార్‌ను గెలిపించాల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తల్లి రాములమ్మ, చెల్లెలు జె.నాగమణి, పార్టీ నాయకులు మంగళవారం చేపట్టిన ఎన్నికల ప్రచారానికి అపూర్వస్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ మ్యానిఫెస్టోను పంపిణీ చేసి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మున్నా చంద్రం, షేక్ హస్సాన్, గొట్టం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం చిన్న బ్రహ్మారెడ్డి, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు పూజల రామయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి చల్లా మట్టారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు నవులూరి భాస్కర్‌రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ వెన్నా లింగారెడ్డి, ఎంపీటీసీ వై. చంద్రమ్మ, పార్టీ నాయకులు జి. సాంబిరెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, షేక్ బిక్కున్‌వలి, అల్లం వాసు, గురవయ్య, దేవళ్ల ప్రసాద్, పురంశెట్టి సత్యనారాయణ, నాగేశ్వరరావు, గాలి అంజి, దోర్నాల బంగారురెడ్డి, వట్టి వెంకటేశ్వరరెడ్డి, ఓర్సు కాశయ్య, మాచవరపు మరియదాసు, జినుగు గురువులు, తుమ్మా ఇన్నారెడ్డి, ఏరువ వియజ భాస్కర్‌రెడ్డి, కొమ్మారెడ్డి మల్రెడ్డి, ఇగుటూరి మల్లారెడ్డి, గూలి వెంకటరెడ్డి తదితరులున్నారు.

ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

దుర్గి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల ఎన్నికల అధికారి జి రజనీకుమారి ఆధ్వర్యంలో బిఎల్‌ఓలకు సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా 85సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన ఓటు వేసుకునే ప్రక్రియను వివరించారు. బూత్ వరకు రాలేని వారిని బూత్‌లలో బిఎల్‌ఓలు గుర్తించి ఇంటి వద్ద నుంచే ఓటు నమోదు చేసే అవకాశాన్ని కల్పించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను సమర్థవంతంగా నిర్వహించి ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని కోరారు. అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు సంబంధిత సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. జిల్లా ఎన్నికల అధికారి సూచనలను పాటిస్తూ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సహాయ సహకారాలఅందించి పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఫణీంద్ర, జూనియర్ అసిస్టెంట్ రత్నకుమార్, బిఎల్‌ఓలు టి జీరయ్య, కోటేశ్వరరావు, రంగారావు, రాజు, గంగమ్మ, సుజాత, పద్మ, ఆపరేటర్ అనిల్ శాస్త్రి, సిబ్బంది ఉన్నారు.

ఎవరు మేలు చేశారో గుర్తించి ఓటు వేయండి

- సరైన ఆలోచన చేసి సరైన నిర్ణయం తీసుకోండి
- గత ఐదేళ్లలో మీ బ్యాంకు ఖాతాలు పరిశీలించుకోండి
- మాచర్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



నరమాలపాడులో పీఆర్కేకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు,



ప్రచార వాహనంపై నుంచి మాట్లాతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

కారెంపూడి : ప్రభుత్వ విప్, మాచర్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) మంగళవారం రాత్రి మండలంలోని నరమాలపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట చర్చిలు, దేవాలయాల్లో పూజల అనంతరం శాంతినగర్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని పీఆర్కే ప్రారంభించారు. తర్వాత రోడ్డు మీద ఎస్సీ కాలనీ, ప్రధాన గ్రామం, అనంతరం వైకుంఠపురంలో ప్రచారం నిర్వహించారు. ప్రచార వాహనం పైనుంచి ప్రజలనుద్దేశించి పీఆర్కే మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మీ బ్యాంకు ఖాతాలు చూసుకోండి. ప్రతి పేద కుటుంబానికి సగటున రూ 3 నుంచి రూ.4 లక్షలు ప్రభుత్వం లబ్ధి చేకూర్చినట్లు తెలుస్తుంది. పేద వర్గాలను ఆదుకోవాలని ఆ కుటుంబాల్లో ఎంతో కాలంగా ఉన్న ఇబ్బందులను తొలగించాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వారిని అన్ని విధాలా ఆదుకున్నారని పీఆర్కే పేర్కొన్నారు. గతంలో మూడు సార్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏనాడైనా పేద వర్గాలను ఆదుకోవాలని ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. అప్పుడు చేయలేని వారు ఇప్పుడేం చేస్తారని, మీకు మేలు చేసిన వారికే ఓటేయాలని, మాయమాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. అందుకు గతాన్ని వర్తమానాన్ని సరి చూసుకోండి. అప్పుడు ఎవరు మోసకారో అర్థం అవుతుందన్నారు. సరైన ఆలోచన చేసి సరైన నిర్ణయం తీసుకుని ఓటేయాలని పీఆర్కే విజ్ఞప్తి చేశారు. గ్రామంలో 2009 మందికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. దాదాపు ప్రతి గడపకు మేలు చేశాం. గ్రామ సచివాలయ భవనంతో పాటు, సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యాలను అభివృద్ధి చేయడం జరిగింది ఇంకా కొన్ని రోడ్లు చేయాల్సి ఉంది అవి కూడా చేస్తాం. శ్మశాన వాటికకు స్థలం కూడా కేటాయి గ్రామస్తులు సమస్యల ఉందనగానే వెంటనే దాని పరిష్కారానికి కృషి చేశానని భవిష్యత్తులో కూడా ఇదే విధమైన అభివృద్ధిని మరింతగా కొనసాగిస్తామన్నారు. గ్రామ సర్పంచ్ బుర్రి రామగురవయ్య, ఎంపీటీసీ చేవూరి భవాని, గుండ్లకుంట వెంకటేశ్వరరెడ్డి, రామ్మడుగు సత్యనారాయణ, సైదారావు, యాకసిరి తిరుపతిరావు, దారివేముల కిరణ్, బుస్సా వెంకటేశ్వర్లు తదితరుల ఆధ్వర్యంలో పీఆర్కేకు ఘనస్వాగతం పలికారు. దారి పొడవునా పూలవర్షంతో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా ప్రజలు ప్రచారంలో పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ మండల ఎలక్షన్ ఇన్‌ఛార్జ్ దోర్నాల సాంబిరెడ్డి, బొమ్మిన అల్లయ్య, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్ పాల్గొన్నారు

హోం ఓటింగ్‌పై అవగాహన కల్పించాలి

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఎస్. రామ్‌మోహన్‌రావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్. రామ్‌మోహన్‌రావు

రెంటచింతల : మండలంలోని వివిధ గ్రామాల్లోని దివ్యాంగులు, 85 సంవత్సరాల పైబడిన వృద్ధులకు హోం ఓటింగ్ నమోదుచేసుకోవడంపై అవగాహన కల్పించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఎస్. రామ్‌మోహన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు, బీఎల్‌ఓలకు హోం ఓటింగ్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో నున్న ప్రతి దివ్యాంగుడికి, 85 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఫారం 12 డి అందచేసి దానిలో పూర్తి చేయాల్సిన అంశాలను వారికి వివరించి పూర్తి చేసిన అనంతరం స్వీకరించాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సరిపై చేసిన వాటిని రిటర్నింగ్ అధికారికి పంపించడం జరుగుతందన్నారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని వృద్ధులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకునేలా వీఆర్వోలు, బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పి. బ్రహ్మయ్య, ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వోలు పల్లా రామకృష్ణ, కె. బాలయ్య, షూకూర్, కుమారస్వామి, రేఖ, మల్లిఖార్జునరెడ్డి, బి. వెంకటేశ్వర్లు, జానయ్య, నాసరయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నాణ్యత విషయంలో రాజీపడితే ఉపేక్షించం

రెంటచింతల : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత విషయంలో రాజీ పడితే ఉపేక్షించేది లేదని క్వాలిటీ కంట్రోలర్ ఏఈఈలు ఓరుగంటి మరియ సుధాకర్‌రెడ్డి, గుర్రం వెంకటేశ్వరెడ్డి అన్నారు. మంగళవారం సత్రశాల, రెంటచింతల, తుమ్మకోట, పశర్లపాడు గ్రామాలలో రూ. 1.55 కోట్ల మైనింగ్ నిధులతో నిర్మించిన ఎస్సీ, బీసీ, మైనార్టీ కమ్యూనిటీ హాల్స్, షాదీఖానా, పశర్లపాడు, తుమ్మకోట గ్రామాల్లో రూ. 60 లక్షల నిధులతో వేసిన సీసీ రోడ్లు, తుమ్మకోట గ్రామంలో రూ. 15 లక్షల ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్ల నిర్మాణ పనుల నాణ్యతా ప్రమాణాలను పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించి విలేకర్లతో మాట్లాడారు. కమ్యూనిటీ హాల్స్, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఖచ్చితంగా నాణ్యత (క్వాలిటీ) కలిగి ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా నిధులను దుర్వినియోగం చేస్తూ నాణ్యత లేకుండా చేపట్టిన పనులకు బిల్లులు నిలిపివేయడం జరుగుతుందని హెచ్చరించారు. నాలుగు గ్రామాల్లో మొత్తం రూ.2.30 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు పూజల పుష్పావతి రామయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు తుమ్మా ఇన్నారెడ్డి, పులి ఓబుల్‌రెడ్డి, శౌంతిరెడ్డి గురవారెడ్డి, ఏరువ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

156 గ్రాముల బంగారం స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

గురజాల : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రవేశించి దొంగతనం చేసిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ టి బాలకృష్ణ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ గురజాల నగర పంచాయతిలోని పశువుల సంత సమీపంలో నివాసం ఉంటున్న బాడిశ శ్రీనివాసరావు మార్చి 11వ తేదిన బంధువుల ఇంటికి వెళ్లి ఏప్రిల్ 2న వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి 64 గ్రాములు బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించగా పాత నేరస్థులు కారంపూడి మండలం మిర్యాల గ్రామానికి చెందిన షేక్ బాబావలి అలియాస్ పండు, మహబూబునగర్‌కు చెందిన సరికొండ మహేష్, వడ్డే పవన్ కుమార్ దొంగతనం చేసినట్లు గుర్తించారు. 16న పులిపాడు అడ్డరోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి భయపడడంతో వారిని విచారించినట్లు తెలిపారు. విచారణలో గురజాల పోలీస్ స్టేషన్ పరిధిలో 1, దాచేపల్లి స్టేషన్ పరిధిలో 3, మాచర్ల స్టేషన్ పరిధిలో 1, తెలంగాణా రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా రాచకొండ స్టేషన్ పరిధిలో 1 దొంగతనం చేసినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుల నుంచి రూ.10,92,000 విలువ గల 156 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐలు బి అనంత కృష్ణ, ఎస్ సౌందర్ రాజన్, ఏఎస్ఐ కోటేశ్వరరావు, కానిస్టేబుల్ కొండలు, సైదులు, పూర్ణచంద్రరావు, హోంగార్డు ఎన్‌కె రాజులను పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ , డీఎస్పీ పల్లపురాజు అభినందనలు తెలిపారు.